

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి :5 సంచిక : 7 పుష్పం : 26 - 29 ఎడిటర్ : పి.హెచ్.వి. సత్యవతి (హైమ)

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-3-2000, గుమ్ములూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

బ్రహ్మం ఒక్కటే, సత్యం ఒక్కటే. దానిని అనేక మంది మహాత్ములు, ఋషులు వారు పొందిన అనుభవాన్ని బట్టి అనేకరకాలుగా చెపుతారు. అందరూ జ్ఞానం గురించే చెప్పినా చెప్పే విధానం దగ్గరకు వచ్చేటప్పటికి ఒకో ఋషి ఒకో పద్ధతిలో చెపుతాడు. ఎవరు ఏ విధంగా చెప్పినా లోపలఉన్న వ్యక్తిని మర్చిపోకూడదు. ఒకో మొఖంలో నుండి ఒకో సరస్వతి వస్తుంది. లోపల జ్ఞానం సమానం, చెప్పే పద్ధతి ఎవరి పద్ధతి వారిది. ప్రకృతి గుణాలు దాటిన తరువాత అందరూ సమానమే అందులో సందేహం లేదు. రామకృష్ణుడు ఎక్కువ సాధన గురించి చెపుతారు, రమణమహర్షి సాధనగురించి తక్కువ చెపుతారు, మనం పొందవలసిన దాని గురించి ఎక్కువ చెపుతారు. ఈ లోకంలో ఏదో మంచిపని చేస్తే వైకుంఠము వెళ్ళవచ్చు, కైలాసం వెళ్ళవచ్చు అని చూస్తున్నారు. మీకు ఎంతసేపు వైకుంఠము గొడవ, కైలాసం గొడవ తప్ప మీ గొడవ మీకు లేదు. లోకంలో గొడవలు అన్నీ తెలుసుకోవాలనుకొంటున్నారు కాని మనలను మనం తెలుసుకోవాలనే బుద్ది మనకు కలగటంలేదు. ఇదే మాయ. వైకుంఠంలో ఆనందం ఉంది, కైలాసంలో ఆనందం ఉంది అని మీరు అనుకొంటున్నారు, ఉంటే ఉండవచ్చును. అసలు ఆనందం లేదు అని నేను చెప్పటం లేదు. కాని హృదయంలో ఉన్న ఆనందం ముందు, శాంతి ముందు వైకుంఠంలో ఉన్న ఆనందము ఏపాటిది. నిజమైన మామిడిపండు ప్రక్కన లక్కతో చేసిన మామిడి పండు పెడితే రెండూ ఒకేలాగ కనబడతాయి. లక్కతో చేసిన మామిడిపండు నోట్లో పెట్టుకొంటే రుచి వస్తుందా? ఈ లోకాలలో ఉన్న ఆనందాలు కూడా అంతే.

బాబా షిరిడీలో ఉండగా వేదపండితులు ఆయనను చూడటానికి వచ్చారు. బాబా దగ్గర వేద పారాయణ చేస్తే ఎంతో కొంత డబ్బు ఇస్తారు తీసుకొని వెళ్ళవచ్చును అని వారి ఉద్ధేశ్యం. బాబా అంటే పైకి ఏదో గొప్పగా ఉంటాడు అని వేదపండితులు అనుకొన్నారు.

కాని చింపిరి బట్టలు వేసుకొని బాబా కూర్చొన్నారు. బాబా అంటే ఏదో గొప్పగా ఉంటాడని అనుకొన్నాము ఈయన పకీరులాగ ఉన్నాడు అని ఆయనరూపం చూసి వారు మాయలో పడిపోయారు. రూపాన్ని బట్టి శక్తి ఉండదు. మనిషిని రూపం ఎక్కువ ఆకర్షిస్తుంది. మనం ఇంత వేదం చదువుకున్నాము వీడికి నమస్కారం పెట్టటం ఏమిటి అని నమస్కారం పెట్టటం మానేసి భూమికి నమస్కారం పెట్టి వేదపారాయణ చేసారు. వేదపారాయణ చేయటం అయిపోయింది. వారు డబ్బుకోసం వచ్చారు అని బాబా గ్రహించారు. అప్పుడు బాబా ఏమి చెప్పారు అంటే మీరు ఎవరికి నమస్కారం పెట్టి వేదపారాయణ మొదలుపెట్టారో వారిని డబ్బుఅడిగి తీసుకోండి అని చెప్పారు. మన మనస్సులోనిది బాబా గ్రహించారు అని ఆ వేదపండితులు అనుకొని అప్పుడు వారు బాబా పాదాల మీద పడ్డారు. అధికారం వలన గర్వం వస్తుంది, డబ్బు సంపాదించడం వలన గర్వం వస్తుంది, కీర్తి వలన గర్వం వస్తుంది, పాండిత్యం వలన గర్వం వస్తుంది. మీరు వేదం పారాయణ చేయవచ్చు, అందులో పొరపాటు లేదు. ఏది పారాయణ చేసినా ఈశ్వరానుగ్రహం కోసం చేయాలి. ఏ పురుషోత్తముడిని తెలుసుకోమని వేదం చెప్పిందో వాడి అనుగ్రహం కోసం వేదం పారాయణ చేయాలి అని బాబా వారికి చెప్పారు. ఎవరైనా డబ్బు ఇస్తే పుచ్చుకోవచ్చు కాని డబ్బు కోసం వేదపారాయణ చేయకూడదు. అది మీరు చేస్తున్న పొరపాటు అని వారికి చెప్పి వారికి కొంత డబ్బు ఇచ్చి పంపించారు. మీరు ఇంటిదగ్గర పూజ చేసిన, జపం చేసిన ఏది చేసినా ఏదో ఆశించి చేయకూడదు. భగవంతుడు ఇస్తే పుచ్చుకోవచ్చు. మీరు ఒకమాట మాట్లాడినా, ఒకపని చేసినా ఈశ్వరానుగ్రహం పొందటం కోసం చెయ్యండి.

సత్యవస్తువు మీ హృదయంలోనే ఉంది, భగవంతుడు మీ హృదయంలోనే ఉన్నాడు అని పెద్దలు చెపుతూ ఉంటే వింటున్నారు కాని ప్రయత్నం మటుకు హృదయ పూర్వకంగా చేయటంలేదు. చిత్తశుద్ధితో చేయటంలేదు. దానిని పొందాలి అని పూర్ణమైన విశ్వాసంతో ప్రయత్నం చేస్తే ఆ వస్తువు మీకు దొరుకుతుంది. మీ మీద మీకే నమ్మకం లేదు ఇంక మీ లోపల ఉన్న వస్తువు మీద మీకు నమ్మకం ఏమి కలుగుతుంది. బాబా ఏమి చెప్పారు అంటే నీవు స్నానం చేస్తావు ఏవరికైనా ఉపకారం చేసాను అనుకొంటావా? లేదు. రోజూ అన్నంతింటావు. ఎవరికైనా ఉపకారం చేసాను అనుకొంటావా? లేదు. అలాగే చారిటి కూడా డ్యూటీగా చెయ్యి. నీవు ఎవరికైనా ఉపకారం చేసినా అది స్నానం చేసిన దానితో సమానం. నీవు స్నానం చేసినప్పుడు ఉపకారం చేసాను అనుకోవటంలేదు నా పని నేను చేస్తున్నాను అని నీకు అనిపిస్తుంది. అలాగే చారిటీ కూడా డ్యూటి క్రింద చెయ్యి

లేకపోతే నీకు పొగరు బోతుతనం వస్తుంది అని బాబా చెప్పారు. అది నీ డ్యూటీ అని అనుకోకుండా ఏదో ఉద్ధరించటానికి చేస్తున్నాను అనుకొంటే నీవు చేసే చారిటీ వలన అంటే ధర్మం వలన నీకు పుణ్యం వస్తుందేమోగాని జ్ఞానం రాదు.

అన్ని భయాల కంటే మరణభయం ఎక్కువ. ఎవడికైతే మరణానికి మరణం వచ్చిందో వాడికి మరణభయం ఉండదు. వాడు జ్ఞాని. గురువు యొక్క వాక్యం యందు విశ్వాసం, శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ ఉంటే ఒక జన్మలోనే బాగుపడతాము శ్రద్ధలేకపోతే కోటిజన్మలు ఎత్తినా బాగుపడము. మీరు ఇంటిదగ్గర పనిని జాగ్రత్తగా చేసుకోండి, పనిని విడిచిపెట్టవద్దు, పని నుండి తప్పించుకోవటానికి చూడవద్దు. మీ చేతిలో ఉన్న పనిని మమకారం లేకుండా చేయండి, మమకారం లేకుండా చేస్తే అహంకారం నశిస్తుంది. అలా పని చేయటం వలన నీకు లాభం వచ్చినా పొంగురాదు, నష్టం వచ్చినా కృంగురాదు సమానంగా ఉంటావు. అప్పుడు నీ మనస్సు హృదయగుహలోనికి జారిపోతుంది. అహంకారం తగ్గిపోతే చాలా సమస్యలు తగ్గిపోతాయి. నేను వస్తే నువ్వు వస్తావు. నువ్వు వస్తే వాడు వస్తాడు. నేను లేకపోతే నువ్వు లేవు, వాడూ లేడు కదా. నువ్వు అంటే లోకం, వాడు అంటే దేవుడు. అహంకారం నశించినవాడు ఆనందం కోసం బాహ్యవిషయాల మీద ఆధారపడడు. ఈ సృష్టి అంతా వాడికి నీటి బొట్టులాగ కనిపిస్తుంది. సముద్రంతో పోల్చుకొంటే నీటిబొట్టు ఎటువంటిదో తనహృదయంలో ఉన్న ఆనందం ముందు ప్రపంచంలోని వస్తుజాలం అంతా అలా కనిపిస్తుంది. నదులు అన్నీ కోపగించుకొని సముద్రంలో కలవకపోతే సముద్రం కంగారు పడదు. అలాగే ఉంటుంది. నదులు అన్నీ పొంగిపోయి వచ్చి సముద్రంలో కలిసిపోతున్నాయి అనుకోండి. ఏమిటి ఇవి అన్నీ వచ్చి కలిసిపోతున్నాయి అని సముద్రం అనుకోదు. అలాగే ఉంటుంది. అహంకారబుద్ధిలేని వాడి జీవితం అలాగే ఉంటుంది అని గీతలో చెప్పాడు. భగవాన్ ఏ మతాన్ని తిట్టలేదు, మన మతాన్ని పొగడలేదు. ఏమతం అయినా ఒకటే; దానిని మీరు అర్ధం చేసుకొంటే బాగుపడతారు, అది ముఖ్యం. నీ హృదయంలో ఉన్న శాంతి లోనికి నిన్ను పంపటానికి భగవాన్ ప్రయత్నం చేసారు. అంతేగాని ఆ మతం గొప్పది, ఈ మతం గొప్పది కాదు, శివుడు కంటే విష్టువు గొప్పవాడు, విష్ణువుకంటే శివుడు గొప్పవాడు అని ఇలాంటి గొడవలు చెప్పి మన కాలాన్ని వ్యర్ధం చేయలేదు. నీవు గోడదగ్గరకు వెళ్ళి నీ తలకాయను గోడకు పెట్టి బాదుకొన్నా నీవు పవిత్రుడవు కాకపోతే నీకు జ్ఞానం రాదు. నేను పూజలు చేసాను, యజ్ఞాలు చేసాను జ్ఞానం రావటం లేదు ఏమిటి అంటే రాదు. మీరు ఏది చేసినా ఈశ్వరానుగ్రహం కోసం చేస్తే మీరు పవిత్రులవుతారు, అప్పుడు జ్ఞానం

కలుగుతుంది.

మిమ్మల్ని బాగుచేయాలని నాకు ఉంది అనుకోండి. అసలు బాగుపడాలని కొంచం అయినా మీకు కూడా ఉండాలికదా. బాగుపడాలనే తలంపు కొంచెంకూడా మీకు లేనప్పడు నేను ఎంత ప్రయత్నంచేసినా నిన్ను ఎలా బాగుచేయగలను. నేను బాగుపడాలనే తలంపు కొంచం అయినా నీకు ఉంటే ఆ తలంపు గురువు యొక్క వైభవాన్ని, అనుగ్రహాన్ని అందుకొంటుంది. అహంభావన నశించిన వాడికి లోకం చాలా చప్పగా ఉంటుంది, ఏమీ అనిపించదు. ఒక వేళ బాహ్యవిషయాల నుండి సంతోషం వస్తోంది అనుకో అది ఎంతకాలం నిలబడుతుంది. ఇవాళ పచ్చగా ఉన్నది రేపు ఎండిపోతుంది. ఇవాళ స్నేహితులుగా ఉన్నవారు రేపు విరోధులు అవ్వవచ్చు. దాని మీద ఆధారపడటం మంచిది కాదు. చివరకు నీకు బానిసత్వం వస్తుంది. ఒక్క ఆత్మానందం తప్పించి బాహ్య విషయాల వలన తాత్కాలికంగా ఆనందం వచ్చినా అది అంతా దుఃఖంగా మారిపోతుంది. అహంభావన నీవే అనుకొంటున్నావు. అది పోతే నేను పోతాను అని కంగారు పడుతున్నావు. అది పోతే నీవు పోవు నీవు ఎవరో నీకు తెలుస్తుంది నీవు ఏదైతే మర్చిపోవాలో దానిని జ్ఞాపకం పెట్టుకొంటున్నావు. అహంభావనను మర్చిపోవాలి కాని నీవు దానినే జ్ఞాపకం పెట్టుకొంటున్నావు, దానిని తిరస్కరించటం లేదు. ఇది అంతా తలంపులనే పేక ముక్కలతో కట్టిన కోట. ఇది అంతా మూలతలంపు మీద ఆధారపడి ఉంది. దానిని డౌట్ చేయగలిగితే, షేక్ చేయగలిగితే మొత్తం కోట అంతా పడిపోతుంది. దానిని డౌట్ చేయక పోతే, షేక్ చేయకపోతే కోట పడదు అంటే అహంభావన పోదు. ఇది పేక ముక్కలతో కట్టిన కోట. దీనిని పడగొట్టటానికి పెద్ద గెడ్డపారలు అక్కరలేదు అంటే కొద్దిగా విచారణ చేస్తే అది పోతుంది. మీ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీకు దేహబుద్ధి లేకపోతే రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. మూలతలంపును అధిగమించాలి. దానిని అలాగే ఉంచుకొని మిగతా ప్రయత్నాలు ఎన్ని చేసినా ప్రయోజనం లేదు. నీవు చేసే పూజలవలన, జపాలవలన, సాధనలవలన మూలతలంపు మీద మొట్టికాయలు పడాలి. పుట్టమీద కొడితే పాము చావదు. పాము తల మీద కొడితే పాము చనిపోతుంది. మూలతలంపును విడిచిపెట్టి ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా పుట్టమీద కొట్టటం వంటిది. దీని వలన ప్రయోజనం లేదు, నీ కాలం అంతా వ్యర్ధమవుతుంది. లోకంలో ఎన్నో విషయాలను తెలుసుకొంటున్నాము. మనలను మనం తెలుసుకోవాలనే బుద్ధి కనీసం ఈ శరీరం శవం అయ్యే రోజున కూడా ఆ బుద్ధి కలగటం లేదు. అన్నీ తెలుసుకొంటున్న నీవు నిన్ను నీవు ఎందుకు తెలుసుకోవటంలేదు. మాయ ఎక్కడో ఉంది.

ఎలాగో ఉంటుంది అనుకొంటున్నావు. ఇదే మాయ.

నీవు అహంకారంగా ఉండటానికి ఇష్టపడుతున్నావు. నీవు ఆత్మగా ఉండటం లేదు. నీకు ఆత్మగా ఉండటం ఇష్ట లేనప్పుడు ఆత్మానందం నీకు ఎలా తెలుస్తుంది. ఆత్మను దేహానికి పరిమితం చేసుకొంటున్నావు అనుకో ఆత్మానందం నీకు ఎలా తెలుస్తుంది, ఆత్మశాంతి నీ చేతికి ఎలా అందుతుంది, అందనే అందదు. మన పురాణాలలో వైకుంఠం యొక్క గొప్పతనం, కైలాసం యొక్క గొప్పతనం వర్ణించారు కదా. నీ హృదయంలో ఉన్న ఆనందం ముందు, శాంతి ముందు ఆలోకాలలో ఉన్న ఆనందం ఏపాటిది అంటున్నారు భగవాన్. ఈ మాట చెప్పటానికి ఎంత ధైర్యం ఉండాలో చూడండి. నీ హృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నీకు వైకుంఠానికి, కైలాసానికి వెళ్ళాలనే తలంపు కూడా ఉండదు అని చెప్పకుండా చెప్పటం, మీరు ఎవరికైనా సహాయం చేస్తున్నారు అనుకోండి వారు దురదృష్టవంతులు, మేము అదృష్టవంతులము అని అనుకొని సహాయం చేయకండి. అలా అనుకొని చేస్తే మీరు చేసిన పరోపకారం వలన ఏదైనా పుణ్యం రావచ్చును గాని ఆధ్యాత్మికంగా మాత్రం సున్న మిగులుతుంది. ఈ మాటలు ఈశ్వరుడు చెప్పడు, గురువుచెపుతాడు. ఈశ్వరుడికి జడ్జిమెంటు వ్రాయటమే పని. అలాగ, ఇలాగ అని చెప్పడు. నీవు చేసిన పుణ్యానికి, పాపానికి ఫలితం వ్రాస్తాడు.

ఈలోకం ఎందుకు ఇలా ఉంది, ఈ గందరగోళం ఏమిటి అని అడిగితే అది సృష్టించిన వాడికి తెలుసు అని చెప్పారు. నీవు ఏదైనా పని చేస్తూ ఉంటే ఆ పని ఎందుకు చేస్తున్నావో నీకు తెలుస్తుంది. అలాగే ఈ లోకం ఎందుకు ఇలా ఉంది అంటే అది సృష్టించిన వాడికి తెలుసు అని బాబా చెప్పారు. దానికి భగవాన్ ఏమి చెప్పారు అంటే దేవుడు దేవుడిలాగ ఉన్నాడు వాడు లోకంగా కనిపిస్తున్నాడు. లోకంగా కనిపించినప్పుడు కూడా వాడు దేవుడే. దేవుడు దేవుడే అన్నారు భగవాన్, లోకం వేరు, దేవుడు వేరు కాదు. ప్రపంచం మీకు మంచిది కాదు, చెడ్డది కాదు. చెడ్డ అనుకొన్నా అది మనస్సు యొక్క కల్పనే, మంచి అనుకొన్నా అది కూడా మనస్సు యొక్క కల్పనే. మనం కొన్ని పాఠాలు నేర్చుకోవటానికి ఈ భూమి మీదకు వచ్చాము, నేర్చుకొని బయటకు పోవాలి. పాఠాలు నేర్చుకోకుండా బయటకు వెళ్ళిపోతే నీకు ఎంత డబ్బు ఉన్నా ఒకటి లేని సున్నలతో సమానము. కృష్ణుడు అర్జునుడితో నాకు ఎవరంటే ఇష్టం అంటే నీవు నేను ఇప్పుడు మాట్లాడుకొన్న మాటలను ఈ కృష్ణార్జున సంవాదాన్ని బాగా అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆచరించి, ఇతరులకు అర్థమయ్యేటట్లు ఎవరైతే చెపుతున్నారో వారు అంటే నాకు ఇష్టం. వారు నా అనుగ్రహానికి దయకు పాత్రులవుతారు. దేవుని దయకు మనం పాత్రులమయితే మనకు అసాధ్యం

అంటూ ఏమీ లేదు, అన్నీ సాధ్యమే. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేని దానికి ఉండటం అంటూ లేదు. లేనిదానిని ఉంది, ఉంది అని మీరు అనుకొంటున్నారు. లేని దానిని ఉంది అని అనుకోవటానికి కారణం నీ మనోవికారం. మనస్సు యొక్క వికారం లేని దానిని ఉన్న దానివలె కనిపింపజేస్తోంది. నీ మనస్సు నశిస్తే ఉన్నది ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఉన్నది ఉన్నట్లుగా కనిపించినప్పుడు లేనిది లేనట్లు నీకు తెలుస్తుంది. మీరు మీ అవసరాల నుండి బయటకు రానక్కరలేదు, మీ అలవాట్లలోనుండి బయటకు రావాలి. లేకపోతే మీ డబ్బునంతా అలవాట్లు తినేస్తాయి.

ఆత్మదృష్టితో నీవు ఈ లోకాన్ని చూడటం లేదు, అహంకారదృష్టితో ఈ లోకాన్ని చూస్తున్నావు. నీవు ఏమాట మాట్లాడినా, ఏపని చేసినా అహంకారదృష్టితో చేస్తున్నావు. భగవంతుని వాక్యానికి నీవు తలవంచటం లేదు. భగవంతుని విశ్వసించటం లేదు దానికి నీ బేధబుద్ధి కారణం. రోడ్డు మీద రాయిని చులకనగా చూస్తావు, గుడిలో రాయిని పూజిస్తావు. ఇది అంతా నీ మనోకల్పన. జ్ఞాన నేత్రంతో నీవు లోకాన్ని చూడటం లేదు, నీ మనోనేత్రంతో లోకాన్ని చూస్తున్నావు. అందుకే ఈ బేధం అంతా కనిపిస్తోంది. భగవంతుడు నిజంగా ఈ లోకాన్ని సృష్టిస్తే ఆయన ఆనంద స్వరూపుడు కదా ఆయన సృష్టించిన లోకం కూడా ఆనందంగా ఉండాలి కదా, మరి ఈ లోకం ఎందుకు దుఃఖంగా ఉంది అని అడుగుతున్నారు. నేను కర్తను అనే భావన తీసివెయ్యి అప్పుడు లోకం అంతా ఆనందస్వరూపంగా కనబడుతుంది. నీ లోపల దుఃఖపడేవాడు ఉన్నంత కాలం లోకం దుఃఖంగా కనబడుతుంది. నీ లోపల దుఃఖపడేవాడిని తీసి ఒక ప్రక్కన పెట్టు అప్పుడు లోకం ఆనందంగానే కనబడుతుంది. జ్ఞానికి అజ్ఞానికి తేడా ఏమిటి అంటే జ్ఞాని ఏకత్వాన్ని చూస్తాడు, అజ్ఞాని అనేకత్వాన్ని చూసి తన అజ్ఞానమును పెంచుకొంటాడు. జ్ఞాని మీ అందరి వంక చూస్తాడు. వాడు మీ గుణాలను చూడడు, మీ రూపాలను చూడడు, మీ రాగద్వేషములను చూడడు మీ లోపల ఉన్న చైతన్యాన్ని చూస్తాడు అంటే మీ లోపల వాడే ఉన్నాడు కదా తనను తానే చూసుకొంటాడు. అందుచేత వాడికి మోహం కలుగదు. ఎవరూ లేని సమయంలో భగవాన్ అలా కొండవంక చూస్తూ ఉండే వారు. మీరు ఎవరిని చూస్తున్నారు అని భగవాన్‌ను అడిగితే నేను అరుణాచల శివుడిని చూస్తున్నాను అని భగవాన్ చెప్పలేదు, నన్ను నేనే చూసుకొంటున్నాను అని చెప్పారు.

భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా ఒకసారి కాలు చాపుకొని కూర్చున్నారు. ఒక పాము కాలు మీదనుండి పాకి వెళ్ళిపోయింది., ఎందుకు ఆ పాము మిమ్మల్ని కరవలేదు అని భగవాన్‌ను అడిగారు. చెట్ల మీద పాములు పాకుతాయి, గోడల మీద పాకుతాయి.

చెట్లను కరుస్తోందా, గోడను కరుస్తోందా దానికి కరవటమే పనా అన్నారు. దానిని చూసిమనం భయపడితే, మనలను చూసి అది భయపడుతుంది. ఆ భయం వలన కరుస్తుంది. రాగం ఉన్న చోట భయం వస్తుంది. బయం ఉన్నచోట కోపం వస్తుంది. భయం పెరిగితే కోపం పెరుగుతుంది. భయం తగ్గితే కోపం తగ్గుతుంది. మాట మాటకు మనకు కోపం వస్తోంది ఏమిటి అని మీకు అనిపిస్తుంది. దానికి లోపల ఉన్న భయం కారణం. మీ పిల్లల మీద ఎక్కువగా కోపం వస్తుంది దానికి కారణం వారు పాడైపోతారేమోనని మనకు భయం. వారి మీద ఉన్న ఇష్టం వలన భయం వస్తోంది. ఇతరులు ఎలా ఉన్నా వారి గొడవ మనకు ఉండదు. నీవు ఏ పని చేస్తున్నావో ఆ పని సక్రమంగా చెయ్యి. పని సక్రమంగా చేస్తూ, అది నీకు అంటకుండా చేస్తూ ఉంటే ఈ లోకంలో యాత్ర బాగా జరిగిపోతుంది, మోక్షాన్ని పొందుతావు. మీరు పని బాగా చేసారు అనుకోండి, మీరు బాగా చేసారు అని ఎవరైనా అంటే మీకు గర్వం రాకూడదు, వికారం రాకూడదు. మీకు వికారం వస్తే ఈ లోకంలో ఫరవాలేదు గాని పరలోకం పోతుంది. నీ హృదయంలో ఉన్న నిజం తప్పించి మిగతావి అన్నీ నీమనస్సు యొక్క కల్పితమే. నీవు కాని దానిని తలపెట్టుకొనే బదులు నీవు ఏదైతే అవునో దానిని నిరంతరము జ్ఞాపకం పెట్టుకొంటే అది అవుతావు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-2-2000, గణపవరం**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

స్వప్నం అసత్యం అనుకొంటాము, జాగ్రదవస్థ సత్యం అనుకొంటాము, స్వప్నం పొట్టిగా ఉంది కాబట్టి అది అసత్యం అనిపిస్తుంది. జాగ్రదవస్థ పొడుగుగా ఉంది కాబట్టి అది సత్యం అనిపిస్తుంది. అది ఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషిప్తి ఈ మూడు అవస్థలలోను బ్రహ్మం ఉంది. బొమ్మలకు తెర ఏవిధంగా ఆధారంగా ఉంటుందో అలాగ ఈ మూడు అవస్థలకు బ్రహ్మం ఆధారంగా ఉంది. మనం పొందే మూడు అవస్థలు అసత్యమే కాని ఈ అవస్థలకు ఆధారంగా ఉన్నది సత్యం. దానినే తురీయము అని పిలుస్తారు. ఏదైతే సత్యమో అదే మంచిది. ఏదైతే మంచిదో అదే అందమైనది. ఈ మూడు శుద్ధ చైతన్యము యొక్క స్వరూపము. ఈ దేహం శవం అవ్వకముందే లోపల ఉన్న బ్రహ్మమును అనుభవంలోనికి తెచ్చుకొంటే అమృతస్థితి పొందుతారు, అదే పరమస్థితి, బ్రహ్మానుభవం వారు పొంది, మనచేత పొందింప చేయటం కోసం కొంతమంది గురువులు ఈ భూమి మీదకు వచ్చారు. అటువంటి గురువులలో

షిర్డీబాబా ఒకరు. ఆయనను సిద్ధపురుషుడు అంటారు. మన శరీరం చనిపోతే ఏదో 11 రోజులు చేస్తారు అక్కడితో మన చరిత్ర పూర్తి అయిపోతుంది. అయితే మహాగురువులు, మహాజ్ఞానులు శరీరం చనిపోయినప్పుడు చనిపోయిన తరువాత వారి చరిత్ర ప్రారంభమవుతుంది.

లోకానికి సంబంధించిన పేరు సంపాదించటం కోసం పని చేస్తున్నాము. భగవంతుని దయను పొందటం కోసం మనం పని చేయటం లేదు. అందుచేత మనకు మోక్షం సున్న అని బాబా చెప్పారు. జీవించి ఉండగా ఇంట్లో వ్యక్తులను చూడరు. శరీరం చనిపోయిన తరువాత 11వ రోజు ఘనంగా చేస్తారు. ఎందుచేతనంటే కార్యక్రమం బాగా చేసారు అని అందరూ అనుకోవాలని చేస్తాము. ఇలా పనిచేయటం వలన లోకం యొక్క గౌరవం పొందగలరు గాని భగవంతుని దయను పొందనే పొందరు. మనం ఎందుకు పని చేస్తున్నామో భగవంతుడికి తెలుసు. ఆయన సర్వసాక్షి. మోక్షం అంటే ఈ ప్రకృతిని విడిచి పెట్టి ఎక్కడికో పారిపోవటం కాదు. ఎక్కడకు వెళ్ళినా పంచభూతాలు ఉంటాయి. కాశీ వెళ్ళినా, రామేశ్వరం వెళ్ళినా, అమెరికా వెళ్ళినా పంచభూతాలు ఉంటాయి. దేహంలోనుండి విడిపోవటం మోక్షం కాదు. ఏ నేను అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో అందులోనుండి విడిపోవటం మోక్షం. తరువాత ఏదో ఒకటి అవుతావు. అది నీ అనుభవానికి తెలుస్తుంది. ముందు దేహగతమైన నేనులో నుండి విడుదల పొందు. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోవాలి. డబ్బు ఉన్నా కొంతమంది లోభిత్వంగా ఉంటారు. కొంతమంది అవసరం లేని ఖర్చులు చేస్తారు, వారి భోగాలకు ఖర్చుపెట్టుకొంటారు. భగవంతుని అనుగ్రహం పొందటం కోసం ఏమి ఖర్చుపెట్టరు, లోకంలో పది మందికి ఉపయోగపడే దానికి ఏమి ఖర్చుపెట్టరు. పరమలోభి ఎటువంటివాడో కేవలం వారి భోగాల కోసం, వారి గొప్పలకోసం ఖర్చుపెట్టేవారు కూడా అటువంటివారే. వాడు, వీడు కూడా సమాజానికి ఏమీ ఉపయోగపడరు. వారు చనిపోయిన వారితో సమానము. మనం పుట్టక ముందు ఈ ప్రపంచం ఉంది. కొన్నివేల సంవత్సరాల నుండి ఈ ప్రపంచం నడుస్తోంది. మనం పుట్టక ముందు ఉన్న జీవకోటి అంతా ఈ మూడు గుణాల మధ్య తిరిగి చనిపోయారు. 1. తమోగుణం, 2. రజోగుణం, 3. సత్వగుణం. మనం కూడా ఈ మూడు గుణాల మధ్యనే తిరుగుతున్నాము. మనం చనిపోయిన తరువాత కొత్త తరం వస్తారు. వారు గొప్పగా ఉంటారని అనుకొంటావేమో డబ్బు పెరగవచ్చు, భోగాలు పెరగవచ్చు. వారు కూడా ఈ మూడు గుణాలమధ్యనే తిరిగి చస్తారు. ఈ లోకంలో అంతకంటే ఏమీ లేదు. అనుకరణ వదిలి వేయండి. పూర్వం గొడవ,

భవిష్యత్ గొడవ వద్దు. ఈ మూడు గుణాలు దేహగతమైన నేనును అంటిపెట్టుకొని ఉన్నాయి. మీరు ప్రయత్నం చేసి ఈ మూడు గుణాలనుండి విడుదల పొందితే మోక్షమును పొందుతారు. ఈ మూడు గుణాల రూపంలోను మాయ ఉంది. ఈ మాయలోనుండి బయటకు రావటం అంత తేలిక కాదు. నిరంతరము నన్ను స్మరిస్తూ ఉంటే, నా పాదాలను ఆశ్రయిస్తే, నేను చెప్పినట్లుగా జీవిస్తూ ఉంటే మాయలో నుండి బయటకు రావటానికి దారి ఇస్తాను అని కృష్ణుడు చెప్పాడు. ముందు తమోగుణం, రజోగుణం విడిచిపెట్టి ఈశ్వరార్పితంగా పనిచేస్తే సత్వగుణం పెరుగుతుంది. అది మీలో ఉన్న మంచితనాన్ని పెంచుతుంది. మంచితనం మనస్సు ను హృదయం వైపుకు మళ్లిస్తుంది, మళ్లించటమే కాదు హృదయంలో శాశ్వతంగా ఉండేటట్లు చేస్తుంది. హృదయం అంటే భగవంతుడు ఉండే చోటు. అక్కడ ఉండగా ఉండగా మనస్సు కరిగిపోతుంది. అప్పుడు నీకు స్వరూపం వ్యక్తమవుతుంది.

నీవు చేసే పని వలన లోకంలో పదిమంది సంతోషిస్తే నీ అహంకారం సంతృప్తి చెందుతుంది. మీరు చేసే పని వలన లోకంలో నలుగురు సంతోషించాలి అనుకొంటున్నావు. అది కురచ ఆలోచన. మీరు చేసే పని వలన భగవంతుడు సంతోషిస్తున్నాడో, లేదో చూడటం లేదు. మీ మొఖాన్ని అటు త్రిప్పటం లేదు. ఆయన దయకు నీవు గురికాకుండా ఆయన స్వరూపాన్ని నీకు ఎందుకు ఇస్తాడు ఆయన ఏమైనా తెలివి తక్కువ వాడా అంటున్నారు బాబా. దేహబుద్ధిలోనుండి బయటకు రావటానికి ఏ పద్ధతిని అవలంభించమంటారు అని అడుగుతున్నారు. దానికి ఒక పద్ధతి అంటూ లేదు. ఎవరికి ఏ పద్ధతి తేలికగా ఉంటుందో ఆ పద్ధతిని అవలంభించి వారు తరించటం ముఖ్యం. నేను చెప్పిన పద్ధతి బుజాన వేసుకొని తిరగండి అని చెప్పటం లేదు. ఆయన హృదయం ఎంత విశాలమైనదో చూడండి. మీ చైతన్య స్థాయిని పెంచుకోవటానికి మీ పద్ధతిలో మీరు ప్రయత్నం చేయండి అనుకరణ వద్దు. ఎవడు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నాడో వాడు ఆ మార్గం మంచిది అనుకుంటాడు. ఇతర మార్గాలు మంచివి కావు అనుకొంటాడు. అలా అనుకొంటే నీకు అహంభావన పెరుగుతుంది. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసిన తరించటం ముఖ్యం. మనం నిర్మలంగా ఈ లోకంలోనికి వచ్చిన జాడ తెలియకుండా పని చేసుకొని పోవాలి. అప్పుడు భగవంతుని దయకు పాత్రులవుతాము. మనం రాజకీయ నాయకులము కాదు కదా మనందరము ముముక్షువులము. అందువలన మనకు టాంటాం అక్కరలేదు. మనం మంచి చేస్తే అదే మనకు వస్తుంది. మనం చెడ్డ చేస్తే అదే మనకు వస్తుంది. ఎక్కడయితే నీవు పొరపాటు చేసావో దాని ఫలితంగా నీవు దుఃఖం అనుభవించాలి. మంచి

పని చేస్తే దాని ఫలితంగా సంతోషం అనుభవించాలి. ఇవి అన్నీ కార్యకారణ సంబంధం. అసలు సత్యం కార్యకారణములకు అది అతీతం. దానికి ఒక కారణం అంటూ ఏమీ లేదు. అది స్వతంత్రమైనది.

జరిగేది అంతా భగవంతుని సంకల్పం ప్రకారం జరుగుతోంది. నేను కర్తను, నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అనుకొంటున్నావు. నీలో ఉన్న గుణాల వలనే అలా అనుకొంటున్నావు. నీలో గుణాలు లేకపోతే నీ సంకల్పం ఈశ్వర సంకల్పం ఒక్కటే. భగవాన్ చివరి రోజులలో కేన్సర్‌తో బాధపడే టప్పడు మీ శరీరం బాధపడుతోంది, మీ రోగం నాకు ఇచ్చేస్తే ఆరోగం వలన వచ్చేబాధ నేను అనుభవిస్తాను అని ఒక అమ్మగారు భగవాన్‌ను అడిగారు. నారోగం నీకు ఇవ్వమంటున్నావు. ఈ రోగం నాకు ఇచ్చిన వాడు ఎవడు అన్నారు భగవాన్. ఈ దేహం యొక్క ప్రారబ్దం అలా ఉంది. అది అనుభవిస్తోంది. నేను ఎవడను నీకు ఇవ్వటానికి. అది ఈశ్వర సంకల్పం. నీవు చెప్పే మాట పైకి సత్వగుణం మాటగా ఉంది కాని లోపల అహంకారమే. నీకు దేహబుద్ది ఉన్నంతకాలం ఏదో కోరిక వస్తూనే ఉంటుంది. నీవు ఏదిగా ఉన్నావో అదిగా ఉంటే కోరిక లేదు, దుఃఖం లేదు. నీవు ఎవరు? ఆత్మవు. నీవు ఆత్మగా ఉంటే ఏ కోరిక ఉదయించదు. భగవంతునికి పరిపూర్ణమైన శరణాగతి పొందితే దాని అంతట అదే మనస్సుకు నిర్మలత్వం వస్తుంది. కాంతి వస్తుంది.

స్వర్గానికి ఒకదేవుడు, నరకానికి ఒకదేవుడు, ఇక్కడ గణపవరానికి ఒకదేవుడు అలా ఇంత మంది దేవుళ్ళు లేరు. దేవుడు ఒక్కడే, వాడుఅవసరమయితే జ్ఞానం బోధించటానికి మావన గురువులను పంపిస్తాడు. భగవంతుని సంకల్పానికి సహాయ సహకారములు అందిస్తూ ఉంటే అనుకోకుండానే మీరు భగవంతుని దయకు పాత్రులవుతారు. అయితే భగవంతుని సంకల్పానికి ఎవరు సహాయం అందిస్తారు అంటే రజోగుణం ఉన్నవారు, తమోగుణం ఉన్నవారు భగవంతుని సంకల్పానికి సహాయం అందించరు, సత్వగుణం ఉన్నవారు సహాయం అందిస్తారు. సత్వగుణం కూడా ఒకగుణమే అది మోక్షం పొందటానికి సహకారం అందిస్తుంది. అందువలన సత్వగుణం పెంచుకోమని పెద్దలు చెపుతారు. శరణాగతి పొందినవాడు భగవంతుని సంకల్పంతో ఏకీభవిస్తాడు. నీకు అనుకూలంగా జరిగితే ఒకలాగ, నీకు అనుకూలంగాలేనిది జరిగితే ఒకలాగ ఉంటే నీవు ఈశ్వరుడికి శరణాగతి పొందలేదు అని గుర్తు. సత్వగుణం ఉన్నవాడు భగవంతుని సంకల్పమే నా సంకల్పం, అయన ఇష్టమే నా ఇష్టం అనుకొంటాడు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా వాడికి దుఃఖం రాదు. ఎందుచేతనంటే ఈశ్వర సంకల్పం ప్రకారం

అలా జరిగింది అనే నిశ్చయం వాడికి ఉంటుంది.

ధనం ఉంటే జనం చేరతారు, అధికారం ఉంటే జనం చేరతారు. ఇవి అన్నీ మెరుపులు. ఈ మెరుపులనుచూసి, లోకానికి సంబంధించిన సంతోషాలు పొందటం కోసం చూసి దేవునికరుణను వదులుకోవద్దు. దేవుడు సంతోషించే పనులే చేయండి. ఏసుక్రీస్తు దగ్గరకు ఒకడు వచ్చి మీకూడా తిరగాలని ఉంది అన్నాడు. అప్పడు క్రీస్తు నీకు శత్రువులు ఎవరైనా ఉన్నారా అని అడిగాడు. శత్రువులు లేకపోవటం ఏమిటి ఉన్నారు అని చెప్పాడు. మరి నాకూడా తిరుగుతావు అనుకో నీ శరీరం నా కూడా ఉండవచ్చును గాని నేను జ్ఞాపకం రాను, నీ శత్రువులే జ్ఞాపకం వస్తారు. అందువలన మనస్సులో ఎవరి మీద శత్రుత్వం లేకుండా చేసుకొని రా, అప్పడు తరిస్తావు అని చెప్పాడు.

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 20-3-2000, చించినాడ**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అన్నశుద్ధి, ద్రవ్యశుద్ధి అవసరం. అన్నం తినేటప్పడు తెలివితేటలుగా ఉండాలి. మనకు అనారోగ్యం చేస్తుందని అనుకొన్నప్పడు అది రుచిగా ఉన్నా తినకూడదు. రుచివేరు, శుచి వేరు. రుచికంటే శుచి ముఖ్యం. శుచి ఉండి రుచిగా ఉంటే ఫరవాలేదు. రుచి ఉండి శుచిగా లేకపోతే అది తినవద్దు. మీ సొంతవ్యవహారాలు ఎంత తెలివిగా చూసుకొంటున్నారో మీరు అన్నం తినేటప్పడు కూడా అంత తెలివిగా ఉండాలని పెద్దలు చెపుతారు. అది అన్నశుద్ధి. కొంతమంది కష్టపడి ధనం సంపాదిస్తారు. దానిని మంచిపనికి ఉపయోగించరు. చనిపోయేటప్పడు దానిని తీసుకొని వెళ్ళే అవకాశం లేదు. మీ దగ్గర ఉన్న ద్రవ్యాన్నిఎప్పడు ఎక్కడ ఎలా ఉపయోగించాలో అది తెలుసుకొని ఉపయోగించాలి. అప్పడు మీరు లక్ష్మీదేవి అనుగ్రహానికి పాత్రులవుతారు. ధనం, అధికారం, కీర్తి జీవుడికి గర్వాన్ని తీసుకొని వస్తాయి. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. ద్రవ్యాన్ని దుర్వినియోగం చేయకూడదు. ద్రవ్యాన్ని సద్వినియోగం చేయాలి. అది ద్రవ్యశుద్ధి. మనకు ఉన్న డబ్బును చెడ్డ పనులకు ఉపయోగిస్తే జీవుడు శరీరాన్ని విడిచి పెట్టినప్పడు ఆ చెడ్డపనులు అన్నీ జ్ఞాపకం వస్తాయి.తెలివి ఉండటం మంచిదే కాని ఆ తెలివిని మీరు ఇంటి వ్యవహారాలకు, ఏదైనా పుస్తకం చదివి అర్థం చేసుకోవటానికి ఉపయోగించుకొంటున్నారు. మీ దగ్గర ఉన్న ద్రవ్యాన్ని ఎలా వినియోగించాలి అని చూడటం లేదు. ద్రవ్యశుద్ధి, అన్నశుద్ధి జీవుడికి ఉండటం లేదు. ధనం, కీర్తి, భోగం, కోరిక ఇవి మనకు ముఖ్యం కాదు, భగవంతుని అనుగ్రహం ముఖ్యం. అన్నశుద్ధి, ద్రవ్య

శుద్ధి ఉంటే మనస్సుకు నిర్మలత్వం వస్తుంది. పవిత్రత వస్తుంది.

పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము. లోపల ఏదో ఉంది అని చెపుతున్నారు. కదా అది మాకు కనబడటం లేదు ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. పూజ, జపం ఇవి అన్నీ బాహ్య ప్రక్రియలు. లోపల కపటం ఉంటే, దోషం ఉంటే నీవు లక్ష జన్మలు ఎత్తి పూజలు, జపాలు చేసినా వస్తువు నీకు అత్యంత సమీపంలో ఉన్నప్పటికి అది నీకు తెలియదు. మీలో ఉన్న దోషాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మీరు బాగుపడటం ముఖ్యం, ఇతరుల గొడవ మీకు అనవసరం. ఏ అజ్ఞానం నుండి బయటకు రావాలో దాని గురించి ప్రయత్నం చేయటం మానివేసి ఏదో పూజ చేసాము, జపం చేసాము, అక్కడ సత్రం కట్టించాము, ఇక్కడ నుయ్యి త్రవ్వించాము అంటే దాని వలన పుణ్యం వస్తుంది అది అనుభవిస్తే పోతుంది. వాటి మీద మీ మనస్సును పెట్టవద్దు. జ్ఞాన సముపార్జనకే ప్రయత్నం చేయండి. ఎవరిమటుకు వారు లోపల పవిత్రత, ఏకాగ్రత ప్రవీణత సంపాదించుకోవాలి అంతే గాని ఎదుటి వారిని చూసి కాపీ కొట్టకూడదు, అనుకరణ వద్దు. భక్తి పేరు మీద పని వదిలించుకోవాలని చూస్తున్నారు కాని పని పట్ల విశ్వాసం గాని, పని కూడా మనలను బాగుచేస్తుంది అనే నమ్మకం గాని మీకు లేదు. ప్రపంచాన్ని చూడకుండా నన్ను కళ్ళుమూసుకోమంటారా అని ఒకరు భగవాన్‌ను అడుతున్నారు. ప్రపంచాన్ని చూడవద్దు అని నేను చెప్పటం లేదు. మొదట నిన్ను నీవు చూసుకొని ప్రపంచాన్ని చూడు అని భగవాన్ చెప్పారు. నీ అలవాట్లలోనుండి బలహీనతలలోనుండి బయటపడటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని వాటిలోనుండి బయట పడకపోతే ఏ జన్మకు ఆ జన్మ అవి నీకూడా వస్తాయి. ఎవడైతే నీకు మోక్షాన్ని ఇస్తాడో వాడి దయను సంపాదించటం కోసం పనిచెయ్యి. నీ శరీరం మరణించేలోపు ఈ లోకంలో నీవు చేయవలసిన పని ఇంక ఏమీ లేదు ఆయన దయను సంపాదించటమే. నీవు ఏ పని చేస్తున్న, పూజ చేస్తున్న, జపం చేస్తున్న నీ లక్ష్యం మటుకు భగవంతుని దయను సంపాదించటమే. భగవంతుని దయను సంపాదిస్తే నీవు అడగకుండానే నీకు మోక్షం ఇస్తాడు. మన దైనందిన జీవితంలో మనం చేసే పనులు, మాట్లాడే మాటలు, మన తలంపులు భగవంతుని దయను సంపాదించటానికి అనుగుణంగా ఉండాలి,. అదే సాధన. అంతేగాని ఏదో పది నిముషములు పూజచేసాము, జపం చేసాము హృదయంలో ఏదో ఉంది అంటున్నారు. అది కనబడటంలేదు అంటే అది ఎలా తెలుస్తుంది. నీ ఇంద్రియాలు, నీ మనస్సు, నీ స్నేహితులే నీకు ప్రమాణం గాని దేవుని వాక్యాలు నీవు ప్రమాణంగా పెట్టుకోవటంలేదు. ఇంక నీకు దేవుడు ఎలా తెలుస్తాడు. నిద్రపోయే ముందు భగవంతుని



5-4-2000

స్మరణ చేస్తే మీరు బాగా లాభం పొందుతారు. ఆధ్యాత్మికంగా ఎక్కువ వడ్డీ వస్తుంది అంటే నిద్రలో మీ సాధన సాగుతుంది, అనవసరమైన కలలు రావు, నిద్ర బాగాపడుతుంది, భగవంతుని దయకు పాత్రులవుతారు. ఆయన దయకు మించినది ఏమీ లేదు.

అన్ని అరిష్టాలకు దేహబుద్ధి కారణం. నీకు దేహబుద్ధి నశించింది అనుకో ఆత్మబుద్ధి కలుగుతుంది. అప్పుడు లోకం లోకంగా కనబడదు, ఆత్మగానే కనబడుతుంది. అప్పుడు అన్ని ఊళ్ళు మనవే, అన్ని కళ్ళు మనవే. శాంతి అనేది నీ హృదయంలో ఉంది, నీకువచ్చే తలంపుల యొక్క వేగం వలన అలజడి వస్తోంది. అలజడి వచ్చేటప్పటికి లోపల ఉన్న శాంతి నీ చేతికి అందటం లేదు. నీ పేరే శాంతి, నీ స్వభావమే శాంతి. భవిష్యత్ గురించి ఆలోచించటం వలన అలజడి వస్తోంది. నీలోపల ఉన్న బ్రహ్మంలో నుండే నేను అనే తలంపు వస్తోంది. ఆతలంపు యొక్క మూలాన్ని అన్వేషించటం కంటే మించిన పని లేదు. సత్ప్రవర్తన లేకుండా దానిని అన్వేషించాలనే బుద్ధి నీకు కలుగదు. నీవు మంచి కర్మలు చేయగా చేయగా, శాస్త్రాన్ని శ్రవణం చేయగా చేయగా నీ మనస్సులో ఉన్న దుమ్ము అంతా రాలిపోతుంది. నీ మనస్సులో ఉన్న దుమ్ము అంతా పోయినప్పుడు నీ మొఖానికి తేజస్సు కలుగుతుంది, పీడ మొఖాలు పోతాయి. మనస్సులోవున్న చెడు అంతాపోతే మనస్సుకు శుద్ధి కలుగుతుంది. నిర్మలత్వం వస్తుంది, మనస్సు అణుగుతుంది. అణిగిన మనస్సుకు అంతర్ దృష్టి కలుగుతుంది. అంతర్ దృష్టి కలిగిన వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మజ్ఞానమే మోక్షం. దానికి వేరుగా శాంతి లేదు, నిర్వాణ సుఖం లేదు. నిప్ప మీద చేయి వేసాము కాలలేదు అంటే అది నిప్ప కాదు అలాగే నీవు సత్కర్మ చేస్తే నీ మనస్సులో ఉన్న దుమ్ము పోవాలి, అది నిన్ను శుద్ధిచేయాలి. అది నిన్ను శుద్ధి చేయకపోతే దానిని నీవు సత్కర్మ అనుకొన్నా అది సత్కర్మ కాదు. మనస్సు శుద్ధి అయితే, దానికి ఏకాగ్రత వస్తే ఆ మనస్సే జ్ఞానాకారం పొందుతుంది. నీవు ఏ పని చేస్తున్నావు అనేది ముఖ్యంకాదు, ఆ పని ఎలా చేస్తున్నావు అని భగవంతుడు చూస్తాడు. దానిని బట్టి నీ మనస్సులో ఉన్న దుమ్ము రాలిపోతుంది.

Just be నీవు సహజంగా ఏదిగా ఉన్నావో అలాగ ఉండు. అలా ఉంటే నీ శరీరం చనిపోతున్నప్పుడు నేను చనిపోతున్నాను అని నీకు అనిపించదు, నీవు ఎప్పుడూ ఉంటావని నీకు తెలుస్తుంది. మనస్సును జయించినవాడిని జ్ఞాని అంటారు. ప్రపంచాన్ని జయించటం కంటే మనస్సును జయించటం కష్టం. ఏది మంచి పని అంటే నీవు చేసే పని ప్రేమగా చెయ్యాలి, రాగద్వేషరహితంగా ఉండాలి, ధర్మాభిముఖంగా ఉండాలి, ఆ పని చేసేటప్పుడు నీ చిత్తం శాంతంగా ఉండాలి దానిని మంచి పని అంటారు. కోరికతో చేస్తూ ఉంటే శాంతం

లేకుండా చేస్తూ ఉంటే నీవు ఏ పని చేసినా అది చెడ్డపనే. నీవు చిరాకుగా చేసేది మంచిపని కాదు. చిరాకుగా ఎవరికైనా అన్నం పెడతావు అనుకో బాహ్యంగా అది నీకు మంచి పని క్రింద అనిపిస్తుంది గాని అది మంచిపనిలోనికి రాదు అంటున్నారు. నీవు ఏ మంచి అయితే సాధించటానికి ప్రయత్నం చేస్తున్నావో ఆ మంచి సాధించటానికి మార్గం కూడా మంచిది అయి ఉండాలి. ఒక చెడ్డ ద్వారా మంచి సాధిస్తావు అనుకో కాల ప్రవాహంలో ఆ మంచి కూడా చెడ్డ అయిపోతుంది. నీకు వ్యక్తి భావన ఉన్నంత కాలం పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం వడ్డీతో సహా అనుభవించవలసిందే.

నీ ఇంద్రియాల ద్వారా నీవు అనుభవించే భోగాలు అన్నీ కూడా మొదట అమృతంగా ఉంటాయి. తరువాత విషంగా మారుతాయి. ఆత్మ జ్ఞానం గురించి యోగులు చెప్పే మాటలు మొదట విషంగా ఉంటాయి. తరువాత అమృతంగా పరిణమిస్తాయి. డబ్బు, అధికారం ఉందని వ్యసనాలకు లోను కావద్దు. నీ డబ్బు ఇక్కడే ఉండిపోతుంది, వ్యసనాలు ఆ జన్మకు ఆ జన్మ నిన్ను వెంటాడి నీ శరీరమే కాదు చివరకు నీ మనస్సును కూడా కుళ్ళిపోయేటట్లు చేస్తాయి. అందువలన వ్యసనపరుడవు కావద్దు, వ్యసనపరుడకు మిగిలేది దుఃఖం. ద్రవ్యశుద్ధి మనకు లేనప్పుడు ద్రవ్యాన్ని చూసి భోగం పెంచేస్తాము. ధనం ఉన్నవారిని లక్ష్మీపుత్రులు అంటారు. ఆడబ్బువలన గర్వం పెంచుకొని, పెంచుకొని చివరకు మనమే లక్ష్మికి పతి అవుదామని అనుకొంటారు. అంత ప్రమాదం ఉంది అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. శరీరం మీద కురుపు వేసింది అనుకోండి. డాక్టరు దగ్గరకు వెళతాము, దానిని కోయిస్తాము, కట్లు కడతాము, అది తగ్గేవరకు మరల హాస్పిటల్‌కు వెళుతూ ఉంటాము. అంత శ్రద్ధ తీసుకొంటాము. అలాగే నీలో చెడు అలవాట్లు, వ్యసనాలు ఉంటే వాటిని తొలగించుకోవటానికి అంత ప్రయత్నం చేస్తేనే గాని అవి తొలగవు. నీ శరీరం మీద ఉన్న కురుపు నిన్ను ఎంత బాధపెడుతోందో, నీ మనస్సులో ఉన్న బలహీనత కూడా నిన్ను అంత బాధపెడుతుంది. ఈ కురుపు కంటే వ్యసనాన్ని తొలగించుకోవటమే ప్రధానం. కురుపు తగ్గకపోయినా శరీరం స్మశానంలో కాలిపోయినప్పుడు అది కూడా పోతుంది. కాని వ్యసనం అలా పోదు అది పునర్జన్మకు కారణం అవుతుంది. కేన్సర్ మొదట దశలో జాగ్రత్త తీసుకొంటే తగ్గుతుంది, చివరి దశ వచ్చేటప్పటికి అది తగ్గదు, చనిపోతాము. అలాగే నీ బలహీనతలను మొదటి దశలోనే తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తే అవిపోతాయి. ఇతరుల గొడవ నీకు అనవసరం. అన్ని రోగాలకు ఒకే మందు ఉండదు, ఒకో రోగానికి ఒకో మందు ఉంటుంది. అలాగే ఒకో బలహీనత తొలగించుకోవటానికి ఒకో పద్ధతి ఉంటుంది. ఆ బలహీనత లేని వారితో సహవాసం చేస్తే బలహీనతలు పోతాయి.

ఏ కర్మ అయితే అహంభావన మూలాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తుందో అదే సత్కర్మ. అలా అని చెపుతూ ఉంటే నీకు అర్థమవ్వటం లేదు కాబట్టి శాస్త్రాలు నీకోసం క్రిందకు దిగివచ్చి మీరు సత్కర్మ చేయండి మీకు మంచి జరుగుతుంది, నీవు వైకుఠానికి వెళతావు, మంచి చేస్తే బాగుపడతావు, పుణ్యం వస్తుంది అని. ఇన్ని రకాలుగా చెపితే గాని నీవు మంచి చేయవు కాబట్టి నీ స్థాయికి దిగి చెపుతున్నారు. భగవాన్ సిద్ధాంతం ఏమిటి అంటే Be and Do ఉండటమే నీ సహజస్థితి. నీవు సహజంగా ఉండు, తరువాత పని చెయ్యి.

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 28-3-2000, గుండుగొలను**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సృష్టికి ఎవడైతే కారణమో వాడిని కర్త అంటారు. వాడే ఈశ్వరుడు. ఈ సృష్టి అంతా వ్యాపించి ఏ వస్తువు అయితే ఉందో అదే మన హృదయంలో కూడా ఉంది. ఈ సృష్టికి కర్త వేరు, మన హృదయంలో ఉన్న వస్తువు వేరు కాదు. రెండూ ఒక్కటే అని భక్తులు ముందు గ్రహించాలి. మన కర్మసాక్షి మన హృదయంలోనే ఉన్నాడు. మనం బయట ఉన్న దేవుళ్ళను మోసం చేయగలమేమోగాని మన లోపల ఉన్న దేవుని మోసం చేయలేము. మనకు వచ్చే తలంపులను, సంకల్పాలను లోపల ఉండి చూస్తూ వాటికి సాక్షిగా ఉంటాడు. ప్రతి జన్మలోను గురువు మన కూడా ఉండి మన మనస్సును పక్వానికి తీసుకొని రావటానికి చూస్తాడు. మనస్సుకు పక్వత రావాలి. మనందరము ఈశ్వరానుగ్రహంలోనే ఉన్నాము కాని దానిని అందుకోలేకపోతున్నాము. గంగానదిలో నిలబడి నాకు దాహం వేస్తోంది మంచి నీళ్ళు దొరకటం లేదు అనుకోవటం ఎటువంటిదో ఈశ్వరానుగ్రహం లేదు అనుకోవటం కూడా అటువంటిదే. మనస్సుకు తగిన బరువు లేదు. మనస్సుకు తూకం, బరువు లోపల నుండి వచ్చేది గాని అది బయట నుండి పూసుకొనేది కాదు. మనస్సుకు పక్వత వస్తే మన హృదయంలో ఉన్న వస్తువు మనకు వ్యక్తమవుతుంది. భగవాన్‌తో ఒకడు నేను స్వార్థం లేకుండా పని చేస్తున్నాను అని చెప్పాడు. నీకు మోక్షం వస్తుంది అని భగవాన్ చెప్పలేదు. స్వార్థం లేకుండా నేను పని చేస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు అది నిజమైతే మటుకు నీకు మోక్షం వస్తుంది అని చెప్పాడు.

హృదయంలో సత్యం ఉంది, వైకుంఠం ఉంది. హృదయంలో ఉన్న వైకుంఠము తాలుక సుఖం మనకు అనుభవంలోనికి వస్తే ఆ మనిషిని ఇంక కర్మ బంధించదు, కర్మ వాడిని ఏమీ చేయలేదు, కర్మ వాడిని వదిలేస్తుంది. మంచికర్మ అనుభవంలోనికి వచ్చినప్పుడు వాడికి సంతోషం రాదు, చెడు కర్మ అనుభవంలోనికి

వచ్చినప్పుడు వాడికి దుఃఖం రాదు. హృదయంలో ఉన్న వైకుంఠము అనుభవంలోనికి వచ్చినప్పుడు స్వర్గాలు నరకాలు, సుఖాలు దుఃఖాలు, మంచి చెడులు అన్నీ నశించి పోతాయి. మీ ప్రారబ్ధంలో ఉన్నది మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అది కూడా మిమ్మల్ని ముట్టుకోదు, మీకు ప్రమాదం తీసుకొని రాదు. లోపల స్వార్థం లేకుండా హృదయపూర్వకంగా పని చేస్తూ ఉంటే వాడు ధ్యానం చేయనక్కరలేదు వాడికి జ్ఞానం కలుగుతుంది. జ్ఞాన సముపార్జనకు అనేక మార్గాలు ఉన్నాయి. ఏదో మార్గంలో ప్రయాణం చేసి జ్ఞానం సంపాదించుకోండి. మనం చేసే పని మానక్కరలేదు, ప్రకృతి గుణాలను దాటాలి. అన్ని కులాలవారు స్త్రీపురుష బేధం లేదు ఎవరైనా సరే సాధన చేస్తే జ్ఞానం పొందుతారు. దీని కోసం నీవు బట్టలుమార్చుకోనక్కరలేదు. ఇల్లు విడిచి ఎక్కడకు వెళ్ళనక్కరలేదు. మీ ఇంటి దగ్గర మీరు చేసే పనే మమకారం లేకుండా చేయండి. ఎలుకల బోనులో ఎలుకలు పడతాయి. భగవంతుడు మనకు రెండు బోనులు వేసాడు. నేను అనే భావన ఒక బోను, నాది నాది అనుకోవటం ఒక బోను. మనం ఈ రెండు బోనులలో పడి ఉన్నాము. ఇందులో ఉన్నంతకాలం మనకు జ్ఞానం కలుగదు. మొత్తం సృష్టిలో ప్రతీ వస్తువు భగవంతుడిదే, ఆయన సంకల్పం ప్రకారం అంతా జరుగుతుంది అనే భావన మనకు లేదు. ఎప్పుడు ఏది ఎలా జరుగుతుందో మనకు తెలియదు. అంతా ఈశ్వర సంకల్పం. ఈశ్వర సంకల్పాన్ని మనం ఆమోదించాలి.

నాకు వచ్చే జన్మ ఉందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఏ కారణం వలన నీకు ఈ జన్మ వచ్చిందో అదే కారణం వలన నీకు వచ్చే జన్మ వస్తుంది అని చెప్పారు. ఇందులో పెద్ద విశేషం ఏముంది అన్నారు. డ్యూటీ చెయ్యాలి, మమకారం పెట్టుకోకూడదు. మీరు కంగారుపడితే ఆ పని పూర్తి అవ్వదు. అది ఎప్పుడు ఎక్కడ ఎలా జరగాలో ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది. భగవంతుని సంకల్పంతో రాజీ పడితే అదే ప్రపత్తి మార్గం, అదే శరణాగతిమార్గం. శరణాగతిమార్గం నీకు కుదిరితే కర్మ నిన్ను ముట్టకోదు పూర్వ జన్మలో చెడు కర్మ ఉన్నా అది అనుభవంలోనికి వస్తున్నప్పటికి అది కూడా నిన్ను అంటదు. మనస్సుకు ఎప్పుడూ హృదయంలోనే ఉండాలని ఉంటుంది. ఎందుచేతనంటే అక్కడ చల్లదనం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. కాని అహంకారము, మమకారము మనస్సును లాగేసి బయటకు తీసుకొని వస్తున్నాయి. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతుంది. మీరు ఇంట్లో వ్యక్తులకు గాని, బయటవారికి గాని ఏదైనా విషయం చెప్పేటప్పుడు అది సలహా రూపంలో ఉండాలి గాని విమర్శరూపంలో ఉండకూడదు. విమర్శించి ఈ సృష్టిలో ఎవరినీ మనం బాగుచేయలేము. మన దేహప్రారబ్ధమును బట్టి

ఒకో పరిసరాలలో ఉంటాము. మన మనస్సు హృదయంలో ఉంటే పరిసరాలు ఏమీ బాధించవు. మనస్సును నియమించుకోవాలి. నీవు పొందవలసిన వస్తువును పొందటానికి ఏదైతే అడ్డువస్తోందో దానిని నియమించుకోవటం మానేసి నేను సన్యాసాశ్రమంలో ఉన్నాను, నేను గృహస్థాశ్రమంలో ఉన్నాను అని చెప్పటం వలన ప్రయోజనం లేదు. నీకు శ్రద్ధ ఉంటే పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా సాధన జరిగిపోతూనే ఉంటుంది. నీకు శ్రద్ధ లేకపోతే పరిస్థితులు అనుకూలంగా ఉన్నా సాధన చేయలేవు. మీరు ముఖస్తుతికి అలవాటు పడకూడదు. దాని వలన పొంగువస్తుంది. అహంకారం ముస్తాబు అవుతుంది. కొంతమంది మిమ్మల్ని విమర్శించవచ్చు, కొంతమంది స్తోత్రం చేయవచ్చు. దానికి మీలో వికారం రాకుండా చూసుకోవాలి. అప్పుడు మనస్సు నిర్మలమవుతుంది, మనస్సు సమానంగా ఉంటుంది, మనస్సు అణుగుతుంది, ఆత్మజ్ఞాన సముపార్జనకు మనస్సు ప్రిపేర్ అవుతుంది, అప్పుడు మనస్సే ఆత్మాకారం చెంది హృదయంలో ఉన్న ఆత్మాకాశంలో లయమవుతుంది.

నేను అనే తలంపు కూడా వెళుతున్నావు గాని అది ఎక్కడ ఉదయిస్తోందో నీవు చూడటం లేదు. దానిని పట్టుకోవటం లేదు. నేను అనే తలంపు ఎక్కడ ఉదయిస్తోందోఅక్కడ ఉంటే నిన్ను జ్ఞానం వరిస్తుంది. హిందువులకు యజ్ఞాలు, యాగాలు అంటే ఇష్టం. రకరకాల వస్తువులను అందులో వేయటం, అలా చేస్తే ఏదో పుణ్యం వస్తుందని అనుకోవటం, దేవతల అనుగ్రహం వస్తుందని అనుకోవటం. ఇటువంటి పిచ్చి గొడవలలోనికి వెళ్ళవద్దు. నీవు స్వార్థం లేకుండా, ఏమీ ఆశించకుండా ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము అని కృష్ణుడు గీతలో చెప్పాడు. మన దగ్గర ఉన్న బలహీనత ఏమిటి అంటే ఆ పని చెయ్యి నీకు పుణ్యం వస్తుంది అంటే చేస్తారుకాని జ్ఞానం కోసం ఎవరూ ఏ పని చేయటంలేదు. ఎందుచేత నంటే జ్ఞానం యొక్క విలువ మీకు తెలియటంలేదు. నా గురువు ఎవరో నాకు తెలియటంలేదు అని భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. నీవు ధ్యానం చేస్తూ ఉంటే నీ మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది. అప్పుడు నీ గురువు ఎవరో నీ హృదయానికి తెలుస్తుంది. అందరి దగ్గరకు వెళ్ళి నా గురువు ఎవరు అని అడగనక్కరలేదు. నీవు కొంచెం ధ్యానం చేస్తే అది నీకే తెలుస్తుంది. నేను అక్కడ అది సాధించాను నేను ఇక్కడ ఇది సాధించాను అని అంటున్నావు. అలా చెప్పే నేను నీవు కాదు. నీవు అక్కడే ఆగిపోతున్నావు. దాని మూలంలో ఉన్న వస్తువే నీవు. నీవు ఏదిగా ఉన్నావో ఆ వస్తువును ధ్యానం చెయ్యటానికి ప్రయత్నం చెయ్యి. నీవు నీవుగా ఉంటే జరగవలసిన పని జరిగిపోతూ ఉంటుంది. నీవు ఆత్మవు.

కాని నీవు దేహంగా ఉంటున్నావు, మనస్సుగా ఉంటున్నావు. నీవు దేహంగా ఉండకుండా, మనస్సుగా ఉండకుండా, ఆత్మగా ఉంటే జరగవలసినపని జరిగిపోతూ ఉంటుంది. నీ సంకల్పంతో, నీ కోరికతో సంబంధం లేకుండా అది జరుగుతూ ఉంటుంది. ఈశ్వరానుగ్రహం లేకపోతే ఒక చిన్న పని కూడా అవ్వదు. మన అహంకారం వలన ఏదీ అవ్వదు. ఇది గుర్తు పెట్టుకోండి. ఈ మాట అర్థం చేసుకొంటే మనకు భయం తగ్గిపోతుంది.

మీరు ఎక్కడికయినా నడిచి వెళుతున్నారు అనుకోండి. నేను నడుస్తున్నాను, నేను నడుస్తున్నాను అని అనుకోక పోయినా మీరు అక్కడకు వెళ్ళిపోతారు. అలాగే నేను అనే తలంపు లేకుండా పని చేస్తున్నారు అనుకోండి ఆ పని పూర్తి అవుతుంది. నేను చేస్తున్నాను అని అనుకోక పోయినా ఆ పని పూర్తి అయిపోతుంది. నేను చేస్తున్నాను అని అనుకొంటే మీకు కొత్త సంస్కారాలు వస్తాయి, కొత్త సంస్కారముల నుండి కొత్త సంకల్పాలు వస్తాయి, అందులో నుండి కొత్త జన్మలు వస్తాయి. మాయ ఎంత బలీయంగా ఉంటుందిఅంటే మీకు ఒక్క జన్మను తీసుకొని వచ్చే సంస్కారం తప్పించి ఇంక ఏమీ లేవు అనుకోండి. ఆ ఒక్క జన్మలో ఇంకో పది బలహీనతలు చేరవచ్చు అందువలన నమ్మటానికి వీలు లేదు. ఒడ్డుకు వచ్చాక వచ్చాము అని అనుకోవాలి. చివరి స్థితికి వెళ్ళే వరకు ఏ క్షణంలో అయినా పడిపోవచ్చు, బహుజాగ్రత్తగా ఉండాలి, అశ్రద్ధ పనికి రాదు. పాయసం, పాయసం అంటే దాని రుచి నీకు తెలియదు, నోట్లో పోసుకొంటే దాని రుచి తెలుస్తుంది. హృదయంలో అమృతం ఉంది అని వేదం చెప్పింది అని నోటితో అనుకొన్నంత మాత్రం చేత అది తెలియదు. అది అనుభవంలోనికి వచ్చినప్పుడు దానికి సంబంధించిన సుఖం, శాంతి నీకు తెలుస్తాయి. ఈశ్వరుని ధ్యానించటం వలన, ఆరాధించటం వలన మనకు ఈశ్వరునితో అనుబంధం ఏర్పడుతుంది. అనుబంధం ఏర్పడినప్పుడు మనం ఆయనకు సేవ చేయటం కాదు, ఆయనే మనకు సేవ చేస్తాడు. మనం భక్తులను గౌరవిస్తాము అనుకోండి. భక్తులు భగవంతునితో తాదాప్యం పొందుతారుకాబట్టి భగవంతుడు మనలనే గౌరవిస్తున్నారు అనుకొంటాడు. తద్వారా కూడా మనం పవిత్రులమవుతాము.

మనకు శుభం వచ్చినప్పుడు ఒకరకంగాను, అశుభం వచ్చినప్పుడు ఒకరకంగాను ఉంటాము. అది భక్తుడి యొక్క లక్షణం కాదు. మంచి జరిగినప్పుడు ఒకలాగ, చెడు జరిగినప్పుడు ఒకలాగ ఉంటాము. ఆ చెడు కూడా ఒక మంచి కోసమే చేసాడు అన్న విషయం మీకు అర్థం కావటంలేదు. చెడ్డ జరిగింది ఏమిటి అని మీరు అనుకోవచ్చు. ఆ చెడ్డ ఇంకో మంచికి దారి తీయవచ్చు. భగవంతుడి ప్రణాళికలో ఆ పని ఎందుకు చేసాడో అది మీకు తెలియదు. భక్తుడి లక్షణం ఏమిటి అంటే కలిసి వస్తే

పొంగిపోడు, కలిసి రాకపోతే కృంగిపోడు. ఎవరి పట్ల వాడికి అసూయ ఉండదు. అసూయ పడటానికి వాడికి టైము ఉండదు. ఎప్పుడూ భగవంతుని చింతనలో ఉంటాడు. సోమరితనం ఉన్నవారికి అసూయ పడటం ఉంటుంది గాని నిరంతరము భగవంతుని చింతనలో ఉన్నవాడికి అసూయ ఏమిటి. మీరు గుడికి వెళతారు. జ్ఞానం కోసం వెళ్లటం లేదు, చాలా మంది కోరికలతో వెళతారు. కోరిక ఎప్పుడూ పరిమిత వస్తువునే కోరుకొంటుంది. కోరిక అంటేనే పరిమితం. పరిమితం లేని స్థితికి కోరిక తీసుకొని వెళ్లలేదు. కోరిక లేని స్థితికి వెళ్లినప్పుడే నీవు పరిమితిని దాటి వెళతావు. పని చేసేటప్పుడు రజోగుణం రాకుండా చూసుకోండి. భగవంతుని జ్ఞాపకం పెట్టుకొంటే నీకు శాంతి కలుగుతుంది. నీకు అశాంతి వస్తూ ఉంటే నీవు భగవంతుడిని మర్చిపోయావని అర్థం. నీ దేహం నిలబెట్టటానికి ఎంత వరకు పని చేయాలో ఆ పని చేసుకో. మిగిలిన కాలాన్ని అంతా జ్ఞానం సంపాదించటానికి ఉపయోగించుకో. చేతులు పని చేస్తూ ఉంటాయి, కాళ్ళు నడుస్తూ ఉంటాయి, కళ్ళు చూస్తూ ఉంటాయి. లోపల ప్రశాంతంగా ఉండినీవు చేతులతో పని చేయాలి, కాళ్లతో నడవాలి, కళ్లతో చూడాలి. లోపల ప్రశాంతతను విడిచి పెట్టకూడదు. బయట ఉన్న వ్యాపకాలను పెంచుకోకూడదు, తగుమాత్రంగా నీ గొడవ ఏదో నీవు చూసుకోవాలి. అనవసరమైన గొడవలలోనికి వెళ్లవద్దు. నీవు ఏదైనా పని చేస్తున్నా అది ఏదో ఇతరులను ఉద్ధరించటానికి చేస్తున్నాను అని అనుకోకూడదు. ఈశ్వరానుగ్రహం కోసం పని చెయ్యి.

మనం ఎంత పెట్టినా వారికి కృతజ్ఞత లేదు ఏమిటి అని కొంతమంది అంటూంటారు. వారి కృతజ్ఞత గొడవ మనకు ఎందుకు. మనకు పెట్టగల శక్తి ఉంటే పెట్టటం లేకపోతే నోరు మూసుకొని కూర్చోవటం. నిజంగా వారు కృతజ్ఞత చూపిస్తారు అనుకోండి. వారు మనకు మోక్షం ఇస్తారా? ఎవడైతే మనకు మోక్షం ఇస్తాడో వాడి దృష్టిలో మనం ఉంటే సరిపోతుంది. చాలామంది తమోగుణంలో ఉంటున్నారు. వారి తమోగుణం ఎలా పోగొట్టమంటారు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. అదే పొరపాటు అంటున్నారు భగవాన్. అటువంటి పిచ్చి గొడవలు వద్దు. నీలో ఉన్న తమోగుణం అలాగే ఉంచుకొని ఇతరులలోతమోగుణం పోగొట్టటం గురించి నీకు ఎందుకు. ముందు నీ తమోగుణాన్ని తొలగించుకో. నీవు బాగుపడటం చూసుకో. నీవు ఎంత వరకు బాగుపడ్డావో అంత వరకు నిన్ను చూసి ఇతరులు బాగుపడతారు. వారిలో తమోగుణం ఉంది, వారిలో రజోగుణం ఉంది, వారు పొట్టిగా ఉన్నారు, వీరు నల్లగా ఉన్నారు అని అంటూ నీ కాలాన్ని వ్యర్థం చేసుకొనే బదులు నీ మనస్సును ఆత్మ వైపుకు ఎందుకు తీసుకొని

వెళ్ళకూడదు. ఇలా ఎందుకు కాలాన్ని వ్యర్థం చేసుకొంటావు. నీవు బాగుపడు, నిన్ను చూసి ఇతరులు బాగుపడతారు. నీవు ఎక్కడైతే ఉండాలో అక్కడ ఉంటే వారికి నిజంగా తమోగుణం ఉన్నా నిన్ను చూసి వారి తమోగుణం పోగొట్టుకొంటారు అది భగవాన్ చెప్పేది.

నీవు ఆత్మవు, నీవు చావు లేని వస్తువువే. నీవు చావులేని వస్తువు అయినప్పటికి నీ ఉనికిని ఈ శరీరానికి పరిమితం చేస్తున్నావు. ఆ పరిమితం చేసుకోవటం వదులుకోవటమే నీ సాధన యొక్క ప్రయోజనం. అప్పుడు పొందవలసింది తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. నీ మనస్సుకు, నీ అహంభావనకు, నీ దేహానికి అన్నింటికి సమస్యలు ఉన్నాయి. ఇంక సమస్యలు లేనిది ఆత్మ, చైతన్యం. ఆ సమస్యలు లేని వస్తువును అందుకొనే వరకు ఏ జన్మకు ఆ జన్మ ఏదో సమస్య నిన్ను వెంటాడుతూ ఉంటుంది. శుచిగా ఉండు, శాంతిగా ఉండు, తపస్సు చేయి అంటే నీ మనస్సును పిండు, నీ మనస్సులోని బలహీనతలను ఎండింపచెయ్యి, నీకు ఉపయోగపడే గ్రంథాలను అధ్యయనం చెయ్యి. మామిడి టెంకలో రసం ఉన్నంత సేపు ఎలా నాకుతామో అలాగ భగవంతుడు చెప్పిన వాక్యాన్ని మననం చెయ్యి, ఈశ్వరుడి పట్ల భక్తి కలిగి ఉండు. మీ కుటుంబ పరిస్థితులు బాగున్నాయని గర్వం తెచ్చుకోవద్దు. ఈశ్వరుడి పట్ల భక్తి విడిచి పెట్టవద్దు. భగవంతుని మీద భక్తి పెంచుకోండి. కోపం తగ్గించుకోండి. అసూయ తగ్గించుకోండి. సర్వకాల సర్వావస్థలలో భగవంతుని మర్చిపోవద్దు. భగవంతుని నిరంతరము స్మరించటం వలన మీరు పవిత్రులు అవుతారు. సంపాదించుకోవలసినది సంపాదించుకోవాలి, పోగొట్టు కోవలసినవి పోగొట్టుకోవాలి. భగవదనుభవం పొందటానికి ఏవైతే అవసరమో వాటిని సంపాదించుకోవాలి. భగవదనుభం పొందటానికి అడ్డువచ్చే వాటిని పోగొట్టుకోవాలి. భగవదనుభవం పొందటం కోసం నిరంతరము భగవంతుని స్మరించాలి. కోపం, అసూయ వీటిని విడిచి పెట్టటం ఎందుకు అంటే అవి భగవదనుభవం పొందటానికి అడ్డువస్తాయి కాబట్టి వాటిని విడిచి పెట్టాలి. సద్వస్తువు నీకు దూరాన లేదు, నీ హృదయంలోనే ఉంది. అది లేదు అని నీవు అనుకొంటున్నావు. ప్రాపంచిక విషయముల పట్ల నీకు మమకారం తగ్గినప్పుడు హృదయంలో ఉన్న వస్తువు వెంటనే నీకు స్ఫురిస్తుంది.

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా